VIGNAN PATRIKA

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

APTEL/2024/89102

సంపుటి : 02 సంచిక : 30 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు : 04 వెల : 02



ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాల్లలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను ఫోన్ నెం. 9951775293


## మావోయిజం ఎప్పటికీ ముగియదు




- ✶ మాట్లాడుతున్న రాజిరెడ్డి. చిత్రంలో దేవ్ జీ
- ✶ ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది
- ✶ సాయుధ పోరాటం ముగిసిందని కూడా చెప్పలేం..
- ✶ లొంగుబాటు అనంతరం మీడియాతో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి
- ✶ మా సిద్ధాంతాల స్ఫూర్తితో త్వరలో రాజకీయాల్లోకి వస్తాం
- ✶ చట్టబద్ధంగా సమస్యలపై పోరు కొనసాగిస్తాం
- ✶ వ్యక్తిగత జీవితం కోసం కాదు: తిరుపతి
- ✶ ప్రజా పోరాటాల వెనుక నిలబడతాం: రాజిరెడ్డి

మావోయిజం ఎప్పటికీ అంతం కాదని మంగళవారం లొంగిపోయిన మావోయిస్టులు అన్నారు. తాము అనారోగ్య కారణాలతోనే అజ్ఞాతాన్ని వీడి బయటికి వచ్చామని చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చి చట్టబద్ధంగా ప్రజా సమస్యలపై పోరాడతామని ప్రకటించారు.

## తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర : సీఎం

- ❖ కల్తీ నెయ్యి.. వ్యవస్థీకృత సిండికేట్ నేరమే
- ❖ చుక్కపాలు సేకరించని సంస్థలకు నెయ్యి టెండర్లు
- ❖ రసాయనాలు, ఇతర పదార్థాలతో తయారీ
- ❖ జంతు కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక
- ❖ దాని ఆధారంగానే నేను, పవన్ మాట్లాడాం
- ❖ 2022లోనే కల్తీ వెలుగులోకి
- ❖ సీఎంఫటీఆర్ఐ నివేదికను తొక్కిపెట్టిన సుబ్బారెడ్డి
- ❖ వైఎస్ నాటి నుంచే తిరుమలలో అపచారాలు
- ❖ శ్రీవారికి ఉన్నది రెండు కొండలేనంటూ 2005 సెప్టెంబరు 16న జీవో 338 జారీ
- ❖ నాడు నేను రద్దుచేయాలన్నది 338నే
- ❖ కానీ జగన్ అబద్ధాలు చెబుతున్నారు
- ❖ ఆయన హయాంలో ప్రణాళిక ప్రకారమే ఆలయాలపై దాడి, విగ్రహాల ధ్వంసం
- ❖ పాపాలు దాచేందుకే హెరిటేజ్‌పై దుష్ప్రచారం
- ❖ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ధ్వజం



తిరుమలకు వెళ్లే అన్యమతస్థులు శ్రీవారిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాలి. కానీ జగన్ తిరుమలకు వెళ్లినప్పుడు డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం చేయలేదు? డిక్లరేషన్‌పై క్యాన్సిల్ అని నమోదుచేసి దౌర్జన్యంగా వెళ్లారు. అధికారం ఉందన్న అహంభావంతో ప్రవర్తించారు. కల్తీ జరిగిందని టీటీడీ చైర్మన్‌గా పనిచేసినవారే (వైవీ సుబ్బారెడ్డి) అంగీకరించారు. కానీ జగన్ ఆయన్ను వెనకేసుకురావడం ఏమిటి? ఏమీ జరగలేదంటూ.. రివర్స్‌లో మేమే క్షమాపణ చెప్పాలంటారా? - సీఎం చంద్రబాబు

## ధైర్యంగా ఉండండి : వైఎస్ జగన్

- ✶ పులివెందులలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన జగన్
- ✶ భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యల స్వీకరణ
- ✶ రేపు నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొననున్న మాజీ సీఎం
- ✶ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం
- ✶ సర్కారు బాధితులకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా
- ✶ పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకం
- ✶ అందరి సమస్యలు వింటూ.. నేనున్నానని ధైర్యం చెబుతూ..
- ✶ పేరు పేరునా పలకరిస్తూ.. కష్టసుఖాలు ఆరా
- ✶ వినతిపత్రాలు స్వీకరించి ధైర్యం చెప్పిన జననేత
- ✶ భారీగా తరలివచ్చిన యువత, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు



- ✶ కార్యాలయం వద్ద జన సందోహం
- ✶ వైఎస్ జగన్‌ను కలిసేందుకు పార్టీ కార్యాలయానికి తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు, ప్రజలు
- ✶ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్


## రేవంత్ మళ్లీ జైలుకు వెళ్లక తప్పదు

- ♦ బాల్క సుమన్‌ను కలిసి జైలు నుంచి బయటకు వస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు
- ♦ కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు.. అప్పుడు రేవంత్‌ను వదిలిపెట్టం
- ♦ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ
- ♦ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో ఆదిలాబాద్ జిల్లా జైలులో ములాఖత్
- ♦ కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయాలను మానుకోవాలి
- ♦ మున్సిపల్ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నచోట పారదర్శకంగా నిర్వహణ చేపట్టాలి



## యూత్ కాంగ్రెస్ చీఫ్ అరెస్టు

- ♦ నాలుగు రోజుల పోలీస్ కస్టడీ
- ♦ 'ఏఐ'నిరసనకు మాస్టర్ మైండ్
- ♦ ఢిల్లీ కోర్టుకు తెలిపిన పోలీసులు
- ♦ త్వరలో మరిన్ని అరెస్టులు!
- ♦ నియంతృత్వం: రాహుల్
- ♦ భయపడేది లేదు: ఖర్గే



## సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ..!

- ● కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం
- ● 'సేవా తీర్థ్' నూతన ప్రాంగణంలో ప్రధాని మోదీ అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం
- ● దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం
- ● కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్
- ● భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్'
- ● రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర



## ఆపరేషన్ ఆక్టోపస్..!

- ❖ డీటెయిల్స్ వెల్లడించిన సజ్జనార్
- ❖ 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్
- ❖ 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్
- ❖ నిందితులకు సహకరించిన బంధన్ బ్యాంక్ అధికారి కూడా అరెస్ట్
- ❖ దేశవ్యాప్తంగా 1,055 కేసుల్లో 127 కోట్ల మోసాలు చేసినట్లు గుర్తింపు
- ❖ 36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు స్వాధీనం



హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు (జజూరా) ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు. ఈ భారీ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి?



# మావోయిజం ఎప్పటికీ ముగియదు

డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన అనంతరం తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డిలు మీడియాతో మాట్లాడారు. మీడియా అడిగే అన్ని ప్రశ్నలకు మరోసారి సుదీర్ఘంగా సమాధానమిస్తామని చెప్పారు. ఇప్పుడు వెంటనే చేసే వ్యాఖ్యానాలు అనవసరమైన చర్చకు దారితీసే అవకాశం ఉందన్నారు.

**వ్యక్తిగత జీవితం కోసం కాదు: తిరుపతి**

'నేను అనారోగ్య కారణాలతో అజ్ఞాతం వీడి బహిరంగ జీవితంలోకి రావాలని నిర్ణయం తీసుకున్నా. వ్యక్తిగత జీవితాన్ని కొనసాగించడం కోసం మాత్రం కాదు. ప్రజల సమస్యలపై చట్టబద్ధ పద్ధతుల్లో, లీగల్ ఫ్రేమ్ వర్క్‌లో పని చేయాలని నిర్ణయించుకున్నా. అంటే రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తానని అర్థం. రాజకీయాల్లో ప్రవేశించి ప్రజా సమస్యలపై పోరాడాలని భావిస్తున్నా. దశాబ్దాల తరబడి నేను నమ్మిన సిద్ధాంతాన్నే మార్గదర్శకంగా తీసుకుని పనిచేస్తా. ప్రస్తుతం మీడియా అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. ఏది మాట్లాడినా అపార్థాలకు దారి తీసే ప్రమాదం ఉంది. అది నా రాజకీయ భవిష్యత్తుకు సమస్య కాకూడదని భావిస్తున్నా. మరోసారి మిమ్మల్ని (మీడియాను) కలిసి అన్ని వివరాలు వెల్లడిస్తా..'అని తిరుపతి అలియాస్ దేవ్‌జీ చెప్పారు.

**ప్రజా పోరాటాల వెనుక నిలబడతాం: రాజిరెడ్డి**

మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'మావోయిజం ఎప్పుడూ ముగియదు. ప్రపంచ వ్యాప్తంగా అది అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. సాయుధ పోరాటం ముగిసిందని చెప్పలేము. ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టపరిధిలో పని చేయాలని ఆలోచిస్తున్నాం. ఇన్నాళ్ల ఉద్యమంలో పొందిన అవగాహనతోనే ముందుకు వెళతాం. అవకాశాల మేరకు ప్రజల పోరాటాల వెనుక నిలబడతాం. కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిపై ప్రభుత్వంతో చర్చిస్తాం...'అని పేర్కొన్నారు.

**సమీప బంధువు ప్రోద్బలంతో..**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ 1996లో 10వ తరగతి చదువుతున్న సమయంలోనే ఆర్‌ఎస్‌యూలో చేరారు. 1998 డిసెంబర్‌లో తన సమీప బంధువు బడె నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ ప్రోద్బలంతో పీపుల్స్‌వార్ గ్రూప్‌లో చేరి అ/?ఙాతంలోకి వెళ్లారు. దామోదర్ ఏటూరునాగారం--మహాదేవపూర్ ప్రాంత మహిళా దళం, కొత్తగూడెం --పాల్వంచ ఏరియా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2000లో ఏటూరునాగారం దళంలో డిప్యూటీ కమాండర్‌గా పదోన్నతి పొందారు. 2019లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సైనిక వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. 2025 జనవరిలో టీఎస్‌సీ కార్యదర్శిగా పదోన్నతి పొంది అదే హోదాలో లొంగిపోయారు. 2001లో ఏటూరునాగారం దళంలో సభ్యురాలైన ఎట్టి నర్సమ్మ అలియాస్ సబితను వివాహం చేసుకున్నారు. 2012లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతి చెందగా.. 2016 అక్టోబర్‌లో చర్ల కమిటీలో పనిచేస్తున్న మడకం కోసి అలియాస్ రజితను వివాహం చేసుకున్నారు. 2022లో తెలంగాణ పోలీసులు ఈమెను అరెస్టు చేయగా ప్రస్తుతం జైల్లో ఉన్నారు.

**ఎల్‌ఎల్‌బీ చదువుతూ ఆర్‌ఎస్‌యూలోకి..**

ఏపీలోని గుంటూరు జిల్లా కాకుమాను మండలం వల్లూరుకు చెందిన నూనె నర్సింహారెడ్డి నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ చదువుతున్న సమయంలో రిటైర్డ్ లెక్చరర్ జంధ్యాల రవీంద్రనాథ్ నాయకత్వంలో 1987లో ఆర్‌ఎస్‌యూలో చేరారు. 1990లో దుర్గి దళానికి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. 1993లో కమాండర్‌గా, 1995లో ఏపీ సౌత్ కోస్టల్ బెల్ట్ కమిటీలో, 1998 నుంచి 2001 వరకు డివిజనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2002లో విజయవాడలో పోలీసులు అరెస్టు చేయగా 2004లో విడుదలయ్యారు. 2005లో ఏఓబీఎస్‌జెడ్‌సీకి బదిలీ అయ్యారు. 2010లో మళ్లీ అరెస్టయి 2014లో విడుదలయ్యారు. 2020లో డీకేఎస్‌జెడ్‌సీ బెటాలియన్ పొలిటికల్ ఎడ్యుకేషన్ అడ్వైజర్‌గా పనిచేశారు. 2025 మే లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి బదిలీ అయ్యారు.

**ఇంటర్ నుంచే ఉద్యమాల వైపు..**

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా అలియాస్ సంజీవ్.. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న సమయంలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. 1982లో పీపుల్స్‌వార్‌లో చేరారు. 1987 అక్టోబర్ వరకు సిరోంచా ప్రాంత సాయుధ దళ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1989 ఏప్రిల్ నాటికి డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 1993లో ఉత్తర గడ్చిరోలి సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా, 1995లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. 2001లో జరిగిన పార్టీ 9వ మహాసభల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎం) సభ్యుడిగా నియమితులయ్యారు. 2017లో సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎం) ఇన్‌చార్జిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా (పీబీఎం) ఎన్నికయ్యారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను లొంగిపోయిన అనంతరం 'అభయ్' పేరుతో పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. మావోయిస్టు పార?టలో అత్యంత కీలకమైన ప్రధాన కార్యదర్శిగా అధికారికంగా ప్రకటించనప్పటికీ ఆ మేరకు గుర్తింపు పొందారు. దేవ్‌జీ భార్య అరికె జైనీ అలియాస్ సృజన కాసన్సూర్ అటవీ ప్రాంతంలో 2020లో మృతి చెందారు.

**ఆర్‌ఎస్‌యూ నుంచి సెంట్రల్ కమిటీ వరకు**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రులపల్లె గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డిది (76) వ్యవసాయ కుటుంబం. తండ్రి వెంకట్‌రెడ్డి, తల్లి రాజమ్మ కాగా ఒక తమ్ముడు ఉన్నాడు. ఈయన ఆర్‌ఎస్‌యూ నుంచి సెంట్రల్ కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. 1971లో ఇంటర్ పూర్తి చేసి 1974లో ఆర్‌ఎస్‌యూలో చేరారు. 1976లో కోరుట్ల, జగిత్యాలలో నమోదైన పలు కేసుల్లో రాజిరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. 1978 నుంచి 1980 వరకు గోదావరిఖని బొగ్గు గనుల ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పని చేశారు. 1982లో పీపుల్స్‌వార్‌లో చేరారు. ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం ఏరియా డివిజనల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. 1988లో ఆదిలాబాద్ సబ్ జైలు నుంచి పారిపోయి అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడిగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి మార్గనిర్దేశం చేసే బాధ్యతలు నిర్వహించారు. తర్వాత పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. 2022లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జిగా నియమితులై ప్రస్తుతం అదే హోదాలో లొంగిపోయారు

# రేవంత్ మళ్లీ జైలుకు వెళ్లక తప్పదు

సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ జైలుకు వెళ్లక తప్పదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌పై ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయాలను మానుకోవాలని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని, అప్పుడు కలుగులో దాక్కున్నా రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. చట్టాలను, ప్రజా తీర్పులను గౌరవించాలని, మున్సిపల్ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నచోట పారదర్శకంగా నిర్వహణ చేపట్టాలన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు గెలిచారని, ఏడు స్థానాలు గెలిచిన కాంగ్రెస్ అధికార దాహంతో ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్‌లు అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. బాల్క సుమన్ జైలుకు వెళ్లడం కొత్తేమీ కాదని, తెలంగాణ కోసం పదుల సార్లు జైలుకు వెళ్లినట్లు కేటీఆర్ గుర్తు చేశారు. డీజీపీ శివధర్‌రెడ్డి సినిమా డైలాగ్‌లు చెప్పారని, బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలు పోలీసులను తిట్టినప్పటికీ వారిపై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఏం తప్పు చేశారని కేసు పెట్టారన్నారని ప్రశ్నించారు. రాహుల్ కుటుంబానికి ఇచ్చే వెయ్యి కోట్లు ఎవరి సొత్తు అని, ఈ విషయంలో ఈడీ ఏం చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు రైతుబంధు ఇచ్చే తెలివి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పూర్తిగా గాలికి వదిలేసి దోపిడే లక్ష్యంగా పనిచేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రెండేళ్ల కాలంలో ఢిల్లీకి చేరవేసేందుకు ముఖ్యమంత్రి వద్ద వెయ్యి కోట్లు సిద్ధంగా ఉన్నాయంటే ఆయన రాష్ట్ర ప్రజల సొత్తు ఇంకా ఎన్ని వేలకోట్లు మింగే ఆలోచనలో ఉన్నారని పేర్కొన్నారు. ములాఖత్ అయిన వారిలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలా కర్, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, గొంగిడి సునీత, కోనేరు కోనప్ప, జీవన్‌రెడ్డి, జాన్సన్ నాయక్ ఉన్నారు. కాగా కేటీఆర్ వచ?చన విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో జైలు వద్దకు చేరుకున్నారు.

# యూత్ కాంగ్రెస్ చీఫ్ అరెస్టు

ఏఐ ఇండియా ఇంపాక్ట్ సదస్సు వేదిక వద్ద అర్ధ నగ్న నిరసన ప్రదర్శన కేసులో భారత యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దాంతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య ఎనిమిదికి చేరింది. చిబ్‌ను ఉదయం 4:30 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకుని ఉదయం 10 గంటలకు పాటియాలా హౌస్ కోర్టు ముందు హాజరుపరిచారు. ఆయనపై నేరపూరిత కుట్ర, ప్రభుత్వోద్యోగికి హాని కలిగించడం, విధి నిర్వహణను అడ్డుకోవడం, ఉద్దేశపూర్వక అవిధేయత వంటి పలు అభియోగాలు నమోదు చేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ నిరసన ప్రదర్శనకు ప్రధాన సూత్రధారి, కుట్రదారు ఆయనేనని పోలీసులు పేర్కొన్నారు. "ఇది నేపాల్‌లో జెన్--జీ నిరసనల నుంచి ప్రేరణ పొందిన పెద్ద కుట్ర. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు అందులో పాల్గొన్నారు. ఈ దర్యాప్తు చాలా ముఖ్యమైనది"అని పోలీసులు కోర్టుకు తెలిపారు. అయితే చిబ్ నిరసన స్థలంలో లేరని, నిరసనకు సంబంధించి ఎలాంటి సూచనలూ చేయలేదని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అంతర్జాతీయ కార్యక్రమాల సందర్భంగా నిరసనలు పరిపాటేనని వాదించారు. భారత్ ప్రజాస్వామ్య దేశమని అంతా అభినందిస్తుంటే నిరసనలకు నిరాకరించడం ఏమిటని ప్రశ్నించారు. వాదనల అనంతరం చిబ్‌కు జడ్జి నాలుగు రోజుల పోలీసు రిమాండ్ విధించారు. గత శుక్రవారం ఢిల్లీలో ఏఐ సదస్సు వేదికైన భారత మండపం ముందు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు టీ షర్టులు విప్పి అర్ధనగ్న నిరసనలకు దిగడం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన వారిలో తెలంగాణకు చెందిన నరసింహ యాదవ్ కూడా ఉన్నారు. వేదిక వద్దకు ప్రవేశం కోసం వారంతా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. త్వరలో మరిన్ని అరెస్టులు ఉంటాయని వెల్లడించారు. ఏఐ సదస్సు నిరసన కేసును క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. తదుపరి దర్యాప్తును క్రైమ్ బ్రాంచ్ తాలూకు ఇంటర్ స్టేట్ సెల్ (ఐఎస్‌సీ) నిర్వహిస్తుంది.

**నియంతృత్వం: రాహుల్**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని మోదీ సర్కారు ఖూనీ చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. చిబ్, ఇతర యువజన కాంగ్రెస్ నేతల అరెస్టులను ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది మోదీ సర్కారు నియంతృత్వ ధోరణులకు, పిరికితనానికి నిదర్శనమంటూ దుయ్యబట్టారు. దేశ ప్రయో జనాల కోసం నిర్భయంగా గొంతెత్తిన యువజన కాంగ్రెస్ సభ్యులను చూస్తే గర్వంగా ఉందన్నారు.

**భయపడేది లేదు: ఖర్గే**

అరెస్టులకు కాంగ్రెస్ భయపడబోదని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. "మమ్మల్ని భయపెట్టాలని మోదీ ప్రయతి?నస్తున్నారు. అదెన్నటికీ జరగదు. ఆయన సర్కారు ట్రంప్‌కు లొంగిపోయింది. ఆయన షరతులన్నింటికీ తలూపింది. ఉపాధి లేక దేశ యువత తీవ్ర నిరాశలో కూరుకుపోతోంది. మోదీ సర్కారుపై వారిలో ఆగ్రహావేశాలు రగులుతున్నాయి"అని ఆయన పేర్కొన్నారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర : సీఎం

దేవదేవుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరుడి పవిత్రతను, సనాతన ధర్మాన్ని దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ దిశగా ఓ వ్యవస్థీకృత సిండికేట్ దారుణ నేరాలకు పాల్పడిందని, ఇందులో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం ఒకటని చెప్పారు. ఒకవైపు కల్తీనెయ్యి సరఫరా.. మరోవైపు అన్యమతప్రచారం.. ఇంకోవైపు హిందూమతంపై దాడిచేయడం ద్వారా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వ్యక్తులను దేవదేవుడు క్షమించడన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో అనేక దారుణాలు వెలుగులోకి వచ్చినా.. తప్పుడు పనులు చేసిన వ్యక్తులు ఇంకా బుకాయించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు హెరిటేజ్‌పై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీలో కల్తీనెయ్యి, దాని అనంతర పరిణామాలపై సీఎం ప్రసంగించారు.

**కల్తీ వెనక కుట్ర..**

2019-24 మధ్య తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు టెండర్ నిబంధనలు మార్చారు. నాణ్యతా ప్రమాణాలు తగ్గించారు. నెయ్యి సరఫరా చేసే సంస్థ నెలకు కనీసం 4 లక్షల లీటర్ల పాలు సేకరించాలన్న నిబంధన ఎత్తివేశారు. వార్షిక టర్నోవర్‌ను రూ.150 కోట్లకు కుదించారు. తాము అనుకున్న కంపెనీలకు టెండర్ కట్టబెట్టేందుకు ముందస్తు కుట్రను అమలు చేశారు. తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిలో కల్తీ ఉందని 2022లోనే ఫిర్యాదులు వచ్చాయి. నెయ్యి శాంపిళ్లను సీఎ?ఫటీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షించగా కల్తీ ఉందని రిపోర్టు వచ్చింది. ఈ నివేదికను నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తొక్కిపెట్టారు. మా ప్రభుత్వం వచ్చాక తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిపై ఫిర్యాదులు రావడంతో అప్పటి టీటీడీ ఈవో (శ్యామలరావు) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)-కాఫ్ ల్యాబ్‌లో 2024 జూలైలో రెండు దఫాలుగా పరీక్ష చేయించారు. నెయ్యి కల్తీతోపాటు జంతు మాంసం కొవ్వు అవశేషాలు ఉన్నాయని నివేదిక వచ్చింది. దీని ఆధారంగానే నేను ఎన్డీఏ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాను. 2019-24 నడుమ తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో కల్తీ జరిగిందని.. రసాయనాలు కలిశాయనే సీబీఐ సిట్ కూడా తేల్చింది. కల్తీ ఘోరం నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగింది. అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న లంచాలు తీసుకున్నారని.. ఆయన ఖాతాలో రూ.4.5 కోట్లు వచ్చిపడ్డాయని సిట్ తేల్చింది. కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకే నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకున్నారు. చుక్క పాలు సేకరించని కంపెనీలు వివిధ రసాయనాలతో కల్తీ నెయ్యిని తయారు చేశాయి. దీంతోనే లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారు చేసి ఘోరమైన అపచారం చేశారు. టీటీడీ సాంకేతిక నిపుణులకు ఖరీదైన ఫోన్లు, గిఫ్టులు ఇచ్చారు.

**టీటీడీ ప్రక్షాళన చేపట్టాం..**

కూటమి ప్రభుత్వం వచ్చాక టీటీడీ ప్రక్షాళనకు చర్యలు చేపట్టాం. లడ్డూ ప్రసాదాల నాణ్యత పెంచాం. భారత ఆహార భద్రత-ప్రమాణాల సంస్థ ధ్రువీకరణ తర్వాతే లడ్డూ తయారీ పదార్థాలు కొనుగోలు చేస్తున్నాం. అన్నప్రసాదాల నాణ్యత పెంచాం. క్యూలైన్ల వద్ద 24గంటలూ పాలు అందించేందుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశాం. భక్తుల రద్దీ నియంత్రణకు కమాండ్ కంట్రోల్ తీసుకొచ్చాం. 60 టీటీడీ దేవాలయాల్లో రూ.700 కోట్లతో అన్నదానం చేపడుతున్నాం. 3.5 ఎకరాల్లో దివ్య ఔషధ వనం ప్రాజెక్టు చేపట్టాం. దేశవ్యాప్తంగా 5వేల దేవాలయాలు నిర్మించాలన్నది ప్రణాళిక. దేశంలోని అన్ని ముఖ్యమైన నగరాల్లో ఆలయాలు నిర్మాణం చేపట్టాలని ఆలోచన. నన్ను అంతమొందించేందుకు అలిపిరి సమీపంలో నక్సల్స్ 23 క్లెమోర్‌మైన్స్ పేల్చినా బతికాను. వేంకటేశ్వరస్వామి పునర్జన్మ ఇచ్చారు. ఈ జీవితం ఆయనిచ్చిన కానుక. నేను బతికి ఉన్నంత వరకు ఆయన పవిత్రతను కాపాడతా. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తా. రోజూ 2నిమిషాలు స్వామిని తలచుకుంటా. ఏ కష్టం, బాధవచ్చినా ఆయన్ను తలచుకుని ముందుకెళ్తా. అదే నా శక్తి. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా క్యూలోనే వెళ్లి స్వామిని దర్శించుకుంటాను. ఎన్టీఆర్ అన్నదానం ప్రారంభిస్తే.. నేను ప్రాణదానం ప్రారంభించాం.

# ధైర్యంగా ఉండండి : వైఎస్ జగన్

మంచి రోజులు ముందున్నాయని, అందరూ ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను కలిసి కష్టాలు చెప్పుకున్న వారికి భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గాలతో నష్టపోయిన వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వైఎస్ జగన్ రాకతో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల కోలాహలంగా మారింది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పులివెందులకు చేరుకున్న ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. నేరుగా తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసి మూడు గంటలకు పైగా ప్రజలతో మమేకమై మాట్లాడారు. క్యాంపు కార్యాలయంలో ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలను కలుసుకున్నారు. కార్యకర్తల కష్టసుఖాలు ఆరా తీస్తూ.. టీడీపీ నేతల అరాచకాలతో ఇబ్బందులు పడిన బాధితుల కష్టాన్ని వింటూ.. నేనున్నానని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. తర్వాత ఇంటి వద్ద వేచి ఉన్న నాయకులతోనూ చర్చించారు. క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ప్రతి ఒక్క కార్యకర్తను పేరు పేరునా పలకరించడమే కాక ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కొంత మంది యువకులు జగన్‌ను దగ్గరి నుంచి చూడాలని, ఆయనతో కరచాలనం చేయాలని అభిమానంతో ముందుకు రాగా, వారి కోరిక మేరకు సెల్ఫీలు దిగుతూ వారితో మాట్లాడారు.

**కార్యాలయం వద్ద జన సందోహం**

వైఎస్ జగన్ పులివెందులకు వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు భారీగా తరలివచ్చారు. వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం ఆవరణమంతా జన సంద్రంగా మారింది. పార్టీ అభిమానులు, కేడర్‌తోపాటు యువత, దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ఇలా అందరూ తరలి రావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. యువకులు వైఎస్ జగన్ నినాదాలతో హోరెత్తించారు. వైఎస్ జగన్ వాహనంపై నుంచి అందరికీ అభివాదం చేస్తూ.. కరచాలనం చేస్తూ.. సెల్ఫీలు దిగుతూ ముందుకు కదిలారు. కాగా, పార్టీనేతలు తదితరులు వైఎస్ జగన్‌ను కలిశారు.

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి?

ఇరాన్ అత్యున్నత నేత ఆయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందారంటూ సాగుతున్న ప్రచారం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఇరాన్‌కు చెందిన ప్రముఖ ప్రతిపక్ష సాయుధ ముఠా 'పీపుల్స్ ముజాహిదీన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్' (ఎంఈకే) ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. సోమవారం నాడు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఖమేనీ నివాస సముదాయం 'మొతాహరి కాంప్లెక్స్'పై తమ సభ్యులు సాయుధ దాడికి పాల్పడ్డారని ఆ సంస్థ వెల్లడించింది. సుమారు 100 మంది ఫైటర్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని, ఈ భీకర పోరులో ఇరాన్ ప్రభుత్వ బలగాలకు భారీ ప్రాణనష్టం వాటిల్లడంతో పాటు, తమ వైపు కూడా ప్రాణనష్టం సంభవించిందని ఎంఈఎక్స్ పేర్కొంది. మరోవైపు ఈ దాడి జరిగినట్లు చెబుతున్న సమయంలో మొతాహరి కాంప్లెక్స్ పరిసరాల్లో భారీగా అంబులెన్సులు మోహరించాయని, భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారని సోషల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ప్రభుత్వ వెబ్‌సైట్లు సైబర్ దాడికి గురై, ఖమేనీకి వ్యతిరేకంగా సందేశాలు ప్రసారమయ్యాయనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వాదనలపై అటు ఇరాన్ అధికారిక మీడియా గానీ, ఇటు అంతర్జాతీయ స్వతంత్ర సంస్థలు గానీ ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. ఖమేనీ ఆరోగ్య పరిస్థితి, మృతిపై వస్తున్న వార్తలను ధ్రువీకరించే ఆధారాలేవీ లభ్యం కాకపోవడంతో ప్రపంచ దేశాలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ఇరాన్ అధికార యంత్రాంగంపై పట్టు కోసం ప్రయత్నిస్తున్న ఎంఈకే చరిత్రను పరిశీలిస్తే గతంలోనూ ఇలాంటి సంచలన ప్రకటనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. 1965లో స్థాపితమైన ఈ సంస్థ 1979 విప్లవంలో పాల్గొన్నప్పటికీ, తదనంతరం ప్రస్తుత నాయకత్వంతో విభేదించి, ప్రవాసంలో ఉంటూ పోరాటం కొనసాగిస్తోంది. ఇదే తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పెంటగాన్ అధికారులు సమర్పించిన సైనిక ప్రణాళికల్లో ఖమేనీతో పాటు ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీని లక్ష్యంగా చేసుకునే 'అస్సాసినేషన్' (హత్య) ప్లాన్ కూడా ఉన్నట్లు వార్తలు రావడం గమనార్హం. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ తాజా పరిణామాలు యుద్ధ మేఘాలకు దారితీస్తాయేమోనన్న అంతటా ఆందోళన వ్యక్తమవుతోంది.

# సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ..!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. నేడు 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్దాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆపరేషన్ ఆక్టోపస్..!

ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపుదాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 234 డెబిట్/క్రెడిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, 152 బ్యాంకు పాస్‌బుక్‌లు, 56 కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ అరవింద్ బాబు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతమైందని కమిషనర్ ప్రశంసించారు. సైబర్ నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నామని, ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ముఠాలోని ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామని, సైబర్ నేరగాళ్లకు సహకరించే బ్యాంకు అధికారులు, మ్యూల్ ఖాతాదారులతో సహా ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

# కర్మ ఫలం

ఏ బంధం గురించి మీరు
కన్నీరు పెట్టుకోవడం మానేయండి
ఎందుకంటే ఏడిపించే వాళ్ళకు
కన్నీటి విలువ తెలియదు
మనిషి విలువ, మనసు వేదన
తెలిసిన వాళ్ళు బాధపెట్టరు.

కర్మఫలం కార్య-కారణ సంబంధం
ఆధారంగా పనిచేస్తుంది
మనం ఏ విత్తనం వేస్తే
ఆ పంటే కదా వచ్చేది
ప్రారబ్ద కర్మ అనేది
గత జన్మల నుండి వచ్చి
ప్రస్తుతం అనుభవిస్తున్న ఫలితం.

క్రియమాణ కర్మ అనేది
ప్రస్తుత జన్మలో చేస్తూ
భవిష్యత్తులో అనుభవించబోయే కర్మ
ఫలితాన్ని ఆశించకుండా
మనిషి చేసే పనులు
కర్మ బంధాన్ని తెంచుతాయి.

కష్ట పడ్డ వారి దగ్గర
ధనం తీసుకొని ఎగ్గొడితే
కర్మఫలం ఖచ్చితంగా ఉంటుంది
ఆ డబ్బు ఏవిధంగా పోవాలో
అదే విధంగా పోతుంది.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# 70 రోజుల పరిపాలన కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**-ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్**

**నెల్లూరు సిటీ... ఫిబ్రవరి 24/...(విజ్ఞాన్ పత్రిక ప్రతినిధి )**

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మా యువ నాయకుడు రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ మరియు కూటమి పెద్దల ఆశీస్సులతో ముఖ్యంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశీస్సులతో గడిచిన 70 రోజులుగా నెల్లూరు నగర కార్పొరేషన్ ఇన్చార్జి మేయర్ గా తాను ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు రూప్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ గత 70 రోజులుగా నిరంతరం కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేశానన్నారు. నిత్యం ఒక ప్రాంతంలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు తనకు సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. డిప్యూటీ మేయర్, సహచర కార్పొరేటర్లు మరియు ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో ప్రతినిత్యం వార్డులలో పర్యటించడం మరియు కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం అదేవిధంగా కార్పొరేషన్ లో జరుగుతున్నటువంటి ఖర్చును ఏ విధంగా తగ్గించాలా, కార్పొరేషన్ రాబడిన ఎలా పెంచాలో ఈ రెండింటి మీద దృష్టి పెట్టామన్నారు. ఈ 70 రోజుల్లో అనేక



సంస్కరణలను తీసుకొచ్చామన్నారు. 2019లో సచివాలయ సిబ్బందికి నియామకాలు ఇస్తే రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా మూడు రోజులపాటు ఆన్యువల్ స్పోర్ట్ మీట్ నిర్వహించామన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్నటువంటి 54 మందికి ఒక్క రూపాయి ఆశించకుండా టెక్నికల్ శాలరీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ 70 రోజుల పరిపాలనలో మేయర్ ఛాంబర్ లో ఒక్క రూపాయి కూడా ఖర్చుకాలేదన్నారు.

- మేయర్ కు ఇచ్చే గౌరవ వేతనం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదన్నారు.
- మేయర్ కు ఇచ్చే కార్ అలవెన్సెస్ డీసెల్ ఒక్క లీటర్ కూడా వాడలేదన్నారు.
- ఏ నమ్మకంతో అయితే మా నాయకులు నాకు ఈ బాధ్యత అప్పగించారో సంతోషంగా నా బాధ్యతను నిర్వహించానన్నారు.

మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్ మరియు మాజీ మేయర్ పొట్లూరి స్రవంతి పై హాట్ కామెంట్స్ చేశారు.. గతంలో కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఉన్నతాధికారి కొడుకుకి టెక్నికల్ శాలరీ కోసం ఫైల్ వస్తే గతంలో పనిచేసిన మేయర్ లక్ష రూపాయలు డిమాండ్ చేస్తే 65వేల రూపాయలు ఫోన్ పే చేయించుకుని సంతకం పెట్టడం జరిగిందన్నారు. గతంలో మేయర్ గా పనిచేసినటువంటి వారిని ప్రోత్సహించి, మంత్రి పదవిని అడ్డుపెట్టుకొని అనీల్ కుమార్ యాదవ్ వందల కోట్ల అక్రమార్జన చేసి, నమ్మిన పార్టీని, నమ్ముకున్న కార్యకర్తను గాలికి వదిలేసి ఇతర దేశాల్లో వ్యాపారాలు చేస్తున్నారన్నారు. మాజీ మేయర్ కి అన్ని రకాలుగా ఆర్థికంగా, వెనక ఉండి నడిపిస్తున్న ఆ మాజీ మంత్రి పాపం గతంలో వీళ్ళని తన నియోజకవర్గం లో అడుగు కూడా పెట్టనివ్వలేదన్నారు. ఇప్పుడు ఆ మాజీ మంత్రికి గిరిజనుల మీద అపారమైన ప్రేమలు కురుపిస్తుండడం హాస్యాస్పదం అన్నారు. గతంలో ఉన్న మేయర్ కమిషనర్ గారి సంతకాన్ని కూడా ఫోర్జరీ చేయడం జరిగిందన్నారు.

- నగరపాలక సంస్థ పరిధిలో పదవ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థుల స్టడీహవర్ క్లాసెస్ లో పిల్లలకు స్నాక్స్ లో కూడా మాజీ మేయర్ అవినీతికి పాల్పడడం జరిగిందన్నారు.
- కార్పొరేషన్ లో ఐఏఎస్ అధికారి ఫోర్జరీ సంతకం కేసు దగ్గర నుంచి పసిపిల్లలు తినే స్నాక్స్ వరకు మాజీ మేయర్ అధికార దుర్వినియోగానికి పాల్పడడం జరిగిందన్నారు.
- విద్యార్థులకు ఇచ్చే స్కూల్ కిట్లలో కూడా మాజీ మేయర్ అవినీతికి పాల్పడడం జరిగిందన్నారు.
- ఇలాంటి వారినా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ప్రోత్సహిస్తున్నది. అన్ని విమర్శలు చేశారు...

## సాదారణ కోవిడ్, కుటుంబ వంటి సర్వేల కన్నా జనగణన-2027 సర్వే రాజ్యంగా బద్ధమైనదని, దానిని క్రమ పద్ధతిలో, ప్రమత్తతో నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ హిమాన్షు శుక్లా**

**నెల్లూరు సిటీ. ఫిబ్రవరి. 25/(విజ్ఞాన్ పత్రిక ప్రతినిధి )....**



మంగళవారం స్థానిక హరనాధపురం లోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాలులో 24/02/2026 నుండి 26/02/2026 వరకు జిల్లా అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో అందరూ శ్రద్దగా జన గణన ప్రక్రియపై అవగాహన పొందాలన్నారు. జన గణన-2027 ముఖ్యంగా రెండు పేజ్ లలో నిర్వహించడం జరుగుతుందని తోలి విడతలో హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ ఉంటుందని, రెండవ విడతగా జనగణన ఉంటుందన్నారు. ప్రతి 10 సంవత్సరములకు ఒకసారి గణన జరుగుతుందని, 2011 తరువాత ఇప్పుడు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సర్వీసులో చేరేటప్పుడు ఎన్నికలు, వి.ఐ.పి పర్యటనలలో విధులు నిర్వహించాలని ఉంటుందని తెలిపారు. 2011 జరిగిన జన గణన సమయంలో తానూ ప్రయివేటు ఉద్యోగంలో ఉన్నానన్నారు. తానూ తొలిసారి జన గణన లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జనగణన వల్ల ప్రభుత్వ స్కీములు అందవనే అపోహ ప్రజలలో ఉందని,



ఇది కేవలం జనగణన మాత్రమె అని, దీని వల్ల ప్రభుత్వ పధకాలు ఆనందవనే ఆపోహ అవసం లేదన్నారు. జన గణన నిర్వహించడం ద్వారా కొత్త గ్రామాలు, కొత్త మునిసిపాలిటీలు ఏర్పడతాయన్నారు. ఇది వ్యక్తి గతం కాదని తెలిపారు. జనగణన ప్రక్రియను సమర్ధవంతముగా అన్ని శాఖల సమన్వయ సహకారంతో, జాగురూకతో నిర్వహించాలని తెలిపారు. ఇది చాల ముఖ్యమైన పాలసి అని తెలిపారు. దీని ద్వారా అభివృద్ధికి బాటలు ఏర్పడతాయని అన్నారు. నెల్లూరు జిల్లా అన్ని రంగాలలో 5 వ స్థానంలో ఉన్నదని, జనగణనలో జిల్లాను మొదటి స్థానం లో ఉంచాలని పిలుపునిచ్చారు. శిక్షణ కు హాజరు కాని అధికారులకు శిక్షణ వివరాలను తెలియ చేయాలన్నారు. ఈ కార్యక్రమలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. తొలుత జనగణన సహాయ సంచాలకులు శ్రీనివాస రావు జనగణన-2027 పై విపులంగా వివరించారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలి.

**-ఏ.పి.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్.**



అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, ఐ.సి.డి.ఎస్ కి బడ్జెట్ పెంచాలని, సమాన పనికి సమాన వేతనం, ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాడ్యుయటీ అమలు చేయాలని, అంగన్వాడీలకి ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం ఏ.పీ.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరు జిల్లా గూడూరు ప్రాజెక్టు ఎన్.జి.ఓ. విశ్రాంతి భవనం ఎదుట చేపట్టిన "రిలే నిరాహార దీక్షలు" మంగళవారం రోజు కి రెండవ రోజుకు చేరుకున్నాయి. గూడూరు సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, 50 సంవత్సరాలు చరిత్ర కలిగిన అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇప్పుడు పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, 2024 మార్చిలో అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేస్తామని జీ.వో నెం.8 ఇచ్చారని, అయితే నేటికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి చట్టానికి అమలు చేయడానికి గైడ్ లైన్స్ రూపొందించలేదని,'మే' నెల అంతా వేసవి సెలవులు మంజూరు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి అధ్యక్ష,కార్యదర్శులు ఏ. ఇంద్రావతి,బి.ఎస్.ప్రభావతి, హెల్పర్స్ అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.నిరీష,ఎస్.కె.మస్తానమ్మ, సెక్టార్ లీడర్లు ఎన్.బుజ్జమ్మ, లక్ష్మి,జి.కృష్ణవేణి,ఎన్.శ్యామల బి విజయమ్మ బి.సరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ పొంగళ్ళ కార్యక్రమం



**దగదర్తి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్**

దగదర్తి గ్రామ పాతూరులో వెలసియున్న పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించినటువంటి పోలేరమ్మ పొంగళ్ళ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాలేపాటి కుటుంబ సభ్యుల తరఫున కంచర్ల సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం వచ్చిన భక్తులకు కంచర్ల సునీల్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరితోపాటు దగదర్తి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు

## శ్రీ శిరిడి సాయిబాబా మందిరం బాబావారి నూతన విగ్రహా ప్రతిష్ఠా మహా కుంభాభిషేకం



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా. తిప్పవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శిరిడి సాయిబాబా మందిరం బాబావారి నూతన విగ్రహ ప్రతిష్టా మహా కుంభాభిషేకం కార్యక్రమాలలో తేది 24-02-2026 మంగళవారం ఉదయం గం॥ 9-00 నుండి 12-00 గంటల వరకు మహాసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, దీక్షాగ్రహణం,అఖండ దీపారాధన,ఋత్విగ్వరణం పంచగవ్య సంస్కారం వైభవంగా మంగళవాయిద్యాల నడుమ వేదపండితుల వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో బాబావారి నూతన విగ్రహ ప్రతిష్టా మహా కుంభాభిషేకం పూజలలో పాల్గొని బాబావారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కావలి నియోజకవర్గం కు సంబంధించి వైయస్సార్సీపి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం

**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్**

కావలి పట్టణం లోని =వా= కళ్యాణ మండపం నందు సోమవారం (ఫిబ్రవరి 23 2026) న నిర్వహించబడినది. కావలి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మరియు వైయస్సార్సీపి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో జిల్లా వైయస్సార్సీపి అధ్యక్షులు, మాజీ మంత్రి వర్యులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి , నెల్లూరు జిల్లా వైయస్సార్సీపి పార్లమెంట్ పరిశీలకులు జెక్కే వెంకట్ రెడ్డి , వైఎస్ఆర్సిపి కావలి నియోజకవర్గ పరిశీలకులు ధనుంజయ రెడ్డి . కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు ,రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అభిమానులు పాల్గొనడం జరిగింది. మరి ముఖ్యంగా వైయస్ఆర్సీపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీ స్థాయి నుండి మండల స్థాయి వరకు ఆయా కేటగిరీలలో అందరికీ పార్టీ బాధ్యతలు అప్పగించడం జరిగింది అని చెప్పారు ఈ బాధ్యతల్లో ఉన్న ప్రతి ఒక్కరు కష్టపడి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలను ఆశయాలను ప్రజల్లోనికి తీసుకువెళ్లి తిరిగి వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని నాయకులను, కార్యకర్తలను కోరడం జరిగింది. తదుపరి శ్రీ జక్కే వెంకట రెడ్డి మాట్లాడుతూ, తదుపరి మాజీ శాసనసభ్యులు శ్రీ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి గురించి ఆయన పరిపాలన గురించి కావలి నియోజకవర్గంలో రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి చేసినటువంటి అభివృద్ధి పనులను గురించి కొనియాడడం జరిగింది. రాబోయే ఎన్నికలలో తన పూర్తి సహకారం రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గారికి ఎల్లప్పుడూ ఉంటుంది అని పేర్కొనడం జరిగింది. వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు శ్రీ కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్నటువంటి విద్వేష పూరిత రాజకీయాలు మంచివి కావని, ప్రజలకు మేలు చేయడానికి వారిని గెలిపించారని , ప్రతిపక్ష రాజకీయ నాయకులను, కార్యకర్తలను కక్షపూరితంగా వేధించడానికి కాదని వారు తెలపడం జరిగింది. అదేవిధంగా కావలి నియోజకవర్గం లో మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వారి విజయానికి సహకరిస్తానని శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొనడం జరిగింది. సభకు విచ్చేసినటువంటి జనాలను చూస్తుంటే ప్రతాప్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయంగా కనిపిస్తుంది అని వారు వ్యాఖ్యానించడం జరిగింది. చివరిగా శ్రీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సభకు విచ్చేసినటువంటి ప్రతి ఆడబిడ్డకు, ప్రతి కార్యకర్తకు, నాయకులకు ప్రత్యేకించి మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియచేసారు.



# విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలి జన విజ్ఞాన వేదిక.

- శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ ప్రగతి"

కావలి :విజ్ఞాన్ దినపత్రిక న్యూస్



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు అధ్యక్షతన వరుసగా 4వ రోజు సైన్సు వారోత్సవాలు స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు అత్యంత ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు సోలో మరియు గ్రూప్ నృత్య పోటీలలో పాల్గొనడం జరిగింది. సీనియర్ (8,9,10 తరగతులు) నృత్య విభాగానికి జ. శారద, లక్ష్మీప్రశాంతి మరియు జూనియర్ (6,7 తరగతులు) నృత్య విభాగానికి రామచంద్రయ్య, లక్ష్మీప్రసన్న న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ బెజవాడ. రవికుమార్ మాట్లాడుతూ..... విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నించి కారణాలను అన్వేషించే 'తత్వాన్ని' చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలు ప్రగతికి ఆటంకమని, సైన్స్ ద్వారానే వాటిని పారద్రోలడం సాధ్యమని, పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పచ్చదనాన్ని పెంచడం ద్వారానే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించగలమని తెలిపారు. అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యతను మరియు సామాజిక అంశాలను ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన 'సోలో' మరియు 'గ్రూపు' నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మరియు వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే జనవిజ్ఞాన వేదిక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్, అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి గాదిరెడ్డి. హరినాథ్, కోశాధికారి టి. సుబ్బరామశర్మ,ఉపాధ్యక్షులు కందికట్టు. నారాయణ, సి. కల్లయ్య, కార్యదర్శి సి. శారద కార్యవర్గ సభ్యులు ఎం.వి.ఎన్. ప్రసాదరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ మేయర్ పోట్లూరు స్రవంతి భర్త జయవర్ధన్ నెల్లూరు ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం



రూప్ కుమార్ యాదవ్ తన అవినీతి పై మూలాపేట శివాలయం వద్ద ప్రమాణం కి సిద్ధమా. రూప్ కుమార్ కు నేను సవాల్ విసురుతున్న స్రవంతి మేయర్ గా వున్నప్పుడు అభివృద్ధికి అడ్డుపడుతున్నారు అన్న మాట నిరూపించ గలరా. ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ను ఉద్దేశించి కుర్చీ కుమార్ అంటూ తీవ్ర విమర్శలు చేశారు. రూప్ కుమార్ యాదవ్ మేయర్ కుర్చీ పోయిందని ఫ్రెస్టేషన్ లో ఏదేదో మాట్లాడుతున్నాడు... రెండు నెలల్లో నెల్లూరు లో కోట్ల రూపాయలు అభివృద్ధి చేసాను అని చెప్పాడు ఒక పని చేయాలన్నా మొదలు పెట్టాలి అన్నా దానికి ఒక పద్దతి ఉంటుంది రెండు నెలల్లో కోట్లు అభివృద్ధి ఎక్కడ చేశాడు చూపాలి.. నెల్లూరు జిల్లా సైదాపురం మండలం లో రూప్ కుమార్ యాదవ్ మైనింగ్ లో తీవ్ర అక్రమాలకు పాల్పడుతున్నాడు. రూప్ కుమార్ యాదవ్ తన అక్రమ మైనింగ్ కోసం హబీబ్ బాషా అనే సర్వేయర్ సంతకం ఫోర్జరీ చేశారు. అక్రమాలకు, అవినీతికి,మాఫియా కు ×ూ× బ్రాండ్ రూప్ కుమార్ యాదవ్. ఫోర్జరీ సంతకాలు నా చేత చేయించింది రూప్ కుమార్ యాదవ్,కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పద్మావతి మైన్, శ్రీనివాస మైన్ వారికి 20 కోట్లు ఇస్తా అని కోటి రూపాయలు ఇచ్చి వేల టన్నులు క్వార్జ్ అక్రమ వ్యాపారం తో వందల కోట్లు రూపాయలు దోచుకున్నారు. మూలా పేట లో 20 కోట్లు రూపాయలు తో ఇళ్లు,వందల కోట్లు రూపాయలు ఆస్తులు రూప్ కుమార్ కు ఎలా వచ్చాయి. కావలి సమీపం లో 60 కోట్ల రూపాయలు క్వార్జ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ కొన్నారా లేదా. ఎన్నో ఏళ్ళుగా మైనింగ్ చేస్తున్న మైనింగ్ వ్యాపారాలు పై చైనా వ్యాపారుల్లో ఉన్న నమ్మకం క్వాలిటీ లేని క్వార్జ్ చైనాకు పంపి రూప్ కుమార్ యాదవ్ క్వార్జ్ మార్కెట్ ను చెడగొట్టాడు. చైనా లో మేయర్ ఆఫ్ నెల్లూరు అని పెట్టుకుని చైనీయులనే బురిడి కొట్టించిన ఘనత రూప్ కుమార్ డౌ అనే చైనా వ్యక్తిని తీసుకు వచ్చి దేశ చట్టాలుకు వ్యతిరేకంగా నెల్లూరు హోటల్ లో ఉంచి జిల్లా అంతా మైనింగ్ కోసం తిప్పాడు రూప్. డౌ అనే చైనా వ్యక్తిని మొలకల పుండ్ల కు తీసుకు వచ్చి క్వార్జ్ క్వాలిటీ టెస్ట్ చేయించిన రూప్ దేశం లోకి ఇతర దేశాల వాళ్ళు వస్తే కొన్ని చట్టాలు ఉంటాయి,వాటిని డౌ అతిక్రమించాడు. దేశ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన రూప్ కుమార్ పై దేశ ద్రోహం కేసు నమోదుచేయాలి. మైనింగ్ లో ఎందరినో బెదిరించి రూప్ కోట్లు రూపాయలు దోచుకున్నాడు జిల్లా లో అతిపెద్ద కుంభకోణానికి రూప్ ఆద్యుడు,ఓ భారీ కుంభకోణానికి అనుమతులు తీసుకున్నాడు. మైనింగ్ మాఫియా పై ప్రభుత్వం లోతైన దర్యాప్తు చేయాలి. మంత్రి నారాయణ, ఎంపి,జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ అందరి పేర్లు వాడుకుని అటవీ భూములు దోచేందుకు సిద్ధం అయ్యారు. రూప్ ఉదయం శివాలయం లో పూజలు చేసి సాయంత్రానికి దేవుడిని దోచుకుంటాడు. నెల్లూరు జిల్లా లో మైనింగ్ లో జరుగుతున్న అవినీతి పై ప్రభుత్వం దర్యాప్తు చేయాలి.

# విజ్ఞాన్ దినపత్రిక నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

**-పొదలకూరు ఎమ్మార్వో మరియు ఎంపీడీవో చేతుల మీదుగా 2026 2027 నూతన సంవత్సర డైరీ ఓపెనింగ్**



విజ్ఞాన పత్రిక రిపోర్టర్ పొదలకూరు

పొదలకూరు పట్టణంలోని ఎమ్మార్వో శివ కృష్ణయ్య మరియు ఎంపీడీవో నరసింహులు వారి చేతుల మీదగా విజ్ఞాన పత్రిక మరియు ఉదయ టీవీ 2026: 2027 నూతన సంవత్సర మరియు ఉగాది సందర్భంగా డైరీలు ఓపెనింగ్ చేశారు నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల మనుషులను గెలుచుకున్న విజ్ఞాన్ దినపత్రిక మండలంలోని అధికారులు మరియు నాయకులు అనధికారులు ముందుగా ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ అందరు బాగుండాలని సుఖశాంతులతో పాడిపంటలతో ఉగాది జరుపుకోవాలని కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో పొదలకూరు ఎమ్మార్వో ఆఫీస్ స్టాఫ్ మరియు ఎంపీడీవో ఆఫీస్ స్టాఫ్ మరియు గాయత్రి విద్యా స్కూల్ వారు పాల్గొన్నారు

# పశు వైద్యశాలలు ఆధునికరించి పాడి రైతులను ఆదుకోండి

**- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం, పాడి పరిశ్రమ రెండు కళ్ళు లాంటివి.**
**-శిధిలావస్థలో ఉన్న వెటర్నరీ హాస్పిటల్స్ ఆధునికరించి మూగ జీవాలను ఆదుకోండి.**
**-ఆధునిక వైద్య పరికరాలు మరియు వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నియామకాలు చేపట్టండి.**
**-24 గంటల ఎమర్జెన్సీ మొబైల్ వెటర్నరీ యూనిట్ ఏర్పాటు చేయండి.**
**- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



కోవూరు /అమరావతి /(విజ్ఞాన్ )

వ్యవసాయం తర్వాత లక్షలాది రైతు కుటుంబాలకు స్థిరమైన రోజువారీ ఆదాయం అందించే పాడి రంగాన్ని బలోపేతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిఅన్నారు. మంగళవారం శాసనసభ సమావేశాల సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం, పాడి పరిశ్రమ రెండు కళ్ళుగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పాడి రైతులకు అండగా నిలుస్తూ నియోజకవర్గ పరిధిలో 235 క్యాటిల్ షెడ్స్ మంజూరు కాగా అందులో 1504 నిర్మాణాలు పూర్తి కాగా మరో 81 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కోవూరు నియోజకవర్గ పరిధిలో కొడవలూరు, చౌకచర్ల, మినగల్లు మరియు మైపాడు గ్రామాల్లో ఉన్న పశువైద్యశాలల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆ భవనాలు ఏ క్షణాన కూలిపోతాయో తెలియని పరిస్థితిలో వున్నాయన్నారు. వర్షాకాలం వస్తే పైకప్పుల నుంచి నీరు కారి మెడిసిన్స్, రికార్డులు, పరికరాలు అన్నీ తడిసి ముద్దవుతున్నాయని అక్కడ పని చేసే వైద్యులు, సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని పశు వైద్యశాలల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఉన్నఅరాకొరా పశువైద్యశాలల్లో మౌలిక సదుపాయాలు సిబ్బంది కొరత వేధిస్తున్నాయని పశువులు జబ్బును పడితే ఒక్కోసారి ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తుందని అత్యవసర పరిస్థితుల్లో నెల్లూరుకు తరలించే లోపు మూగజీవాలు మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు లేని సందర్భాల్లో కేవలం ఒక ఆవు, ఒక గేదె మీదే ఎన్నో కుటుంబాల జీవనం ఆధారపడి ఉదన్న సన్న కారు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కోవూరు నియోజకవర్గంలోని పశువైద్యశాలలకు కొత్త భవనాల నిర్మాణానికి తక్షణ నిధుల మంజూరు చేయడంతో పాటు అవసరమైన వైద్య పరికరాల సమీకరణ, వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నియామకాలు చేపట్టాలని అన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోవూరు నియోజకవర్గంలో 24 గంటలు పశు వైద్య సేవలు అందించేందుకు ఎమర్జెన్సీ మొబైల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

# మేలో ఏలూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

**-రైతాంగ ఐక్యతకు వేదికగా మహాసభలు**
**- రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య**

ఏలూరు, ఫిబ్రవరి. 24:



మే నెలలో ఏలూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య తెలిపారు. ఏలూరులోని అన్నే భవనంలో జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే రాష్ట్ర మహాసభలు ఈసారి ఏలూరులో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని ఐక్యం చేసే విధంగా మహాసభలు జరగనున్నాయని పేర్కొంటూ, మహాసభల విజయానికి రైతులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాల వల్ల దేశ వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా నుండి 13 రకాల పంటలు సుంకాలు లేకుండా దిగుమతి అయితే స్థానిక పంటలకు ధరలు పడిపోతాయని అన్నారు. ఇప్పటికే నష్టాల కారణంగా అప్పుల్లో కూరుకుపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పలు చట్టాలు తీసుకువచ్చిందని విమర్శించారు. విత్తన చట్టం, విద్యుత్ చట్టం, డిజిటల్ అగ్రి మిషన్, వ్యవసాయ మార్కెట్ చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. రైతులు కోరుతున్న మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టి జిల్లాలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేయాలని, భూములు కోల్పోతున్న రైతులకు ప్రైవేట్ మార్కెట్ విలువ ఆధారంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ధాన్యం అమ్మిన రైతులకు బకాయి ఉన్న రవాణా కిరాయిలు, హమాలీ చార్జీలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఘంటా అప్పారావు, సున్నా వెంకట్రావు, లావేటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బాలికను వేధించిన కేసులో యువకుడు అరెస్ట్



గోకవరం ఫిబ్రవరి :

24 గోకవరం మండలం కామరాజుపేట గ్రామం హై స్కూల్ నందు 7 వ తరగతి చదువుతున్న బాలికను కొత్తపల్లి గ్రామానికి చెందిన కాళ్ళ రాకేశ్ ఏ రాకీ అనువాడు బాలిక స్కూల్ వెళ్ళు క్రమంలో ఆమెను ఆపి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న బాలిక తల్లి ఫిర్యాదు పై పోక్సో కేసు నమోదు చేసి, సదరు రాకేశ్ ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం 1వ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ వారివద్ద హాజరుపరిచినట్లు గోకవరం ఎస్సై వి.ఎన్.వి.పవన్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి వేధింపులు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.